క్లుప్తంగా

మునిగిన పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మైలవరం(పెద్దముడియం) : పెద్దముడియం మండలంలోని కుందూ పరివాహక ప్రాంతమైన పాలూరు గ్రామంలో సాగుచేసిన మినుము పంట దెబ్బతినడంతో ఏడీఏ అనిత బుధవారం పరిశీలించారు. కొద్దిరోజులుగా ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరదల కారణంగా వరదనీరు పంటపొలాల్లో పారుతుంది. దీంతో ముందస్తుగా సాగుచేసిన మినుము, మొక్కజొన్న రైతులు పంటలో నీరు నిల్వ ఉండటంతో కుళ్లిపోయిందని పంట కాపుదశలో దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు పంటను రక్షించుకోవడం కోసం ఎకరాకు ఒక బస్తా యూరియా, 15 కిలోల పోటాష్ ఎరువు చల్లుకోవాలని సూచించారు. పంట పొలాల్లో నీటిని బయటకి పంపేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

25న జరిగే ధర్నా విజయవంతం చేయండి



ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : ఈనెల 25న విజయవాడలో డీఎస్సీ టీచర్స్ ఫోరం ఏపీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా చౌక్‌ను విజయవంతం చేయాలని డీఎస్సీ జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వరరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను డీఎస్సీ ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ప్రకారం వీరికి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 2003 డీఎస్సీకి సంబంధించిన ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వరిలో మోతాదుకు మించి నీరు పెట్టొద్దు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

చక్రాయపేట : వరి పంట సాగు చేసిన రైతులు మోతాదుకు మించి నీరు పెట్టొద్దని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ వరి రైతులకు నీటి యాజమాన్యం విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరిలో అవసరానికి మించి నీటిని పెట్టడం వల్ల కొన్ని ఇబ్బందులు కూడా కలుగుతాయన్నారు. ముఖ్యంగా ఆరు తడులు పెట్టడం మరింత శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్తేరు రాణి ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అనంతరం వరి పంటను పరిశీలించి పైపుల ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

జూనియర్ వెటర్నరీ అధికారికి ప్రశంసా పత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న చంద్ర కిశోర్

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె, సిద్దవటం మండలాల ఇన్‌చార్జి జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్న బి.చంద్ర కిశోర్ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలో పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ చేతులమీదుగా ఆయన ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

పులివెందుల టౌన్ : రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ నియామకం వెంటనే జరగాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ 2021లో అప్పటి ప్రభుత్వం రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పేద రెడ్డి కుటుంబాలకు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సహకరించడమే ఈ కార్పొరేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్పొరేషన్ ఏర్పడి చాలా కాలమైనా చైర్మన్ నియామకం జరగకపోవడంవల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ రైతులకు సబ్సిడీలు అందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు.

వేసవి పత్తి పంట.. రైతులకు ఊరట

- ఎకరాకు రూ.40వేల మేర సాగులో పెట్టుబడులు
- ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల మేర దిగుబడులు
- మార్కెట్‌లో క్వింటా పత్తి రూ.7,700లతో కొనుగోలు



గొందిపల్లెలో పత్తిని తూకం వేస్తున్న కూలీలు



పత్తిని సంచులకు ఎత్తుతున్న కూలీలు



పత్తిని లారీకి లోడు చేస్తున్న కూలీలు

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి పంట రైతులకు ఊరటనిస్తోంది. అదునులో పంట సాగు చేయడంతో పాటు ఆశించిన మేర దిగుబడులు రావడం, మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉండటం రైతులకు కలిసొచ్చింది. ఈ ఏడాది రైతులు మార్చి నెల నుంచే పత్తి పంట సాగుపై దృష్టి పెట్టారు. వేముల మండలంలో 4 వేల ఎకరాలకుపైనే వేసవి పత్తి పంట సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. ఎక్కువగా వ్యవసాయ బోర్ల బావుల కింద పత్తి పంటను రైతులు సాగు చేసుకున్నారు.

ఎకరాకు రూ.40 వేలకుపైనే పెట్టుబడులు

పత్తి పంట సాగులో ఈ ఏడాది పెట్టుబడులు ఎకరాకు రూ.40 వేలకుపైనే పెట్టారు. పత్తి విత్తనాలను సాగు చేసినప్పటి నుంచి దిగుబడులు చేతికొచ్చేవరకు ఈ మేర పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నారు. పత్తి విత్తనాలు, కలుపు తీయడం, తెగుళ్లు సోకకుండా మందులు పిచికారి చేయడం, తోటలలో పత్తి తీయడం వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. తెగుళ్ల నివారణకు ఒక్కో రైతు నాలుగు సార్లు నివారణా మందులను పిచికారి చేశారు. తోటలలో పత్తి తీసేందుకు కూలీలకు క్వింటాకు రూ.1300ల మేర ఖర్చు చేశారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు పెట్టుబడులకు వెనుకాడలేదు.

పత్తి రైతుకు కలిసొచ్చిన వర్షాభావం

ఈ ఏడాది వర్షాబావం నెలకొనడంతో రైతులకు కలిసొచ్చిందనే చెప్పాలి. పత్తి పంట కాలం 120 రోజులు. 90 రోజుల నుంచే పంటలో దిగుబడులు ప్రారంభమయ్యాయి. దిగుబడులు వచ్చే సమయానికి ఎండలు బాగా ఉన్నట్లయితే దిగుబడులు బాగా వస్తాయి. పత్తి కూడా నాణ్యతగా ఉంటుంది. పత్తి పంటకు ఎండలు ఎక్కువగా ఉన్నట్లయితే పత్తి కూడా బాగా కనిపిస్తుంది. అదే వర్షాలు వస్తే పంటలో దిగుబడులు సక్రమంగా అందవు. వర్షం వలన పత్తి రంగు మారిపోతుందని, ఇలాంటి పత్తికి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారని రైతులు అంటున్నారు. వర్షం కంటే ముందు వచ్చిన దిగుబడులకు వర్షం తర్వాత వచ్చిన దిగుబడులకు క్వింటాపై ఐదారు వందల రూపాయలు తేడా ఉంటుంది.

ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల మేర దిగుబడులు

ఈ ఏడాది ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల మేర దిగుబడులు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. మార్చి నెలలోనే సాగు చేసిన పత్తిలో దిగుబడులు ఆశించిన మేర వచ్చాయని, ఏప్రిల్, మే నెలలో సాగు చేసిన పత్తి పంటలో ఆశించిన మేర దిగుబడులు రాలేదని రైతులు చెబుతున్నారు. మార్చి నెలలో సాగు చేసిన పత్తిలో ఎకరాకు 15 క్వింటాళ్లకుపైనే దిగుబడులు వచ్చాయని, ఏప్రిల్ నెలకు సాగు చేసిన పత్తి పంటలో ఎకరాకు 12 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయని రైతులు అంటున్నారు.

క్వింటా పత్తి రూ.7,700లతో కొనుగోలు..

ఈ ఏడాది మార్కెట్‌లో క్వింటా పత్తి రూ.7,700లతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పత్తి ధరలు స్థిరంగా ఉన్నాయనే చెప్పవచ్చు. మండలంలోని గొందిపల్లె, వి.కొత్తపల్లె, దుగ్గన్నగారిపల్లె, చాగలేరు, వేముల గ్రామాల్లో అత్యధికంగా పత్తి పంట సాగైంది. ఈ గ్రామాల్లో నంద్యాల, గుంటూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మధ్యవర్తుల ద్వారా పత్తి దిగుబడులను కొనుగోలు చేస్తున్నారు. ఈ గ్రామాల నుంచి రోజుకు 10 లారీలకుపైనే పత్తిని వ్యాపారులు కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. ఒక వేముల మండలంలోనే 300 లారీల మేర పత్తి ఉంటుందనే చర్చ నడుస్తోంది.

ధరల నిలకడతోనే సాగులో ఆదాయం..

ఈ ఏడాది పత్తి ధరలు నిలకడగా ఉన్నాయి. మార్కెట్‌లో హెచ్చుతగ్గులు లేకుండా ఉండటంతో పత్తి సాగులో ఆదాయం ఉంటోందని రైతులు అంటున్నారు. ముందుగా సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.1.20లక్షల మేర ఆదాయం రాగా పెట్టుబడులు రూ.40వేలుపోనూ రూ.80వేలు మిగులు ఉంటోందని, ఏప్రిల్ నెలలో సాగు చేసిన పత్తిలో ఎకరాకు రూ.90వేలకు మించి ఆదాయంలేదని పెట్టుబడులు రూ.40వేలుపోనూ రూ.50వేల మేర సా గులో మిగులు ఆదాయం ఉంటోందని రైతులు చెబుతున్నారు. ఇదంతా దిగుబడులు వచ్చే సమయానికి పత్తి ధరలు నిలకడగా ఉండటంతోనే ఆదాయం కళ్లజూస్తున్నామని రైతులు చెబుతున్నారు.

4ఎకరాలలో పత్తి సాగు చేశా



నాకున్న 4 ఎకరాలలో వేసవిలో పత్తి సాగు చేశా. సాగుకు రూ.1.60 లక్షల మేర పెట్టుబడులు పెట్టా. సాగులో 60 క్వింటాళ్ల మేర దిగుబడులు అందాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నా దిగుబడులు పెరగడం, ధరలు స్థిరంగా ఉండటంతో ఆదాయం ఉంటోంది.

– సుదర్శన్‌రెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

పత్తి సాగులో ఆశించిన మేర దిగుబడులు



పత్తి సాగులో ఆశించిన మేర దిగుబడులు అందుతున్నాయి. నాకున్న 8 ఎకరాలలో పత్తి సాగు చేశా. సాగులో రూ.4 లక్షల మేర పెట్టుబడులు పెట్టా. వంద క్వింటాళ్లకుపైనే పత్తి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నా. ధరలు నిలకడగా ఉండటంతో పత్తి సాగు ఈ ఏడాది ఆదుకుందనే చెప్పవచ్చు.

– అంకిరెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవికుమార్

సింహాద్రిపురం : ప్రశాంతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఎస్‌ఐ రవి కుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వినాయకచవితి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా నిబంధనలు పాటించని కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవంపై అవగాహన

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో బుధవారం జాతీయ శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పి.సనావుల్లా మాట్లాడుతూ మూఢ విశ్వాసాల వ్యాప్తిని అరికట్టాలన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను శాస్త్రీయ పద్ధతిలో ఆలోచించి పరిష్కారం కనుగొనాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనిత మాట్లాడుతూ యువత శాస్త్రీయ దృక్పథం కలిగి, భిన్న సంస్కృతి, సాంప్రదాయాల మధ్య పరస్పర సోదర భావం కలిగి జీవించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ బాలనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మా ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్దు



డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తచెదారం నిల్వ కోసం ఏర్పాటు చేయనున్న సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ డంపింగ్ యార్డును పెద్దన్నపాడు, కోడూరు గ్రామాలకు చెందిన ప్రజలు అడ్డుకున్నారు. బుధవారం ఆర్డీఓ సాయిశ్రీ స్థల పరిశీలనకోసం మున్సిపల్ కమిషనర్ శేషఫణితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థలపరిశీలనకు వచ్చారని తెలుసుకున్న పెద్దనపాడు గ్రామస్తులు ఈప్రాంతంలో డంపింగ్ చేయడం ద్వారా తమ పంటపొలాల్లో వ్యర్థాలు వచ్చి చేరుతాయన్నారు. అయితే అధికారులు మాత్రం పెద్దనపాడు-కోడురు ప్రాంతాల మధ్యలో సర్వేనంబర్ 247లో 4.9 ఎకరాల భూమి కేటాయించిందని తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డుకు కోర్టునుంచి అనుమతులు కూడా ఉన్నాయని రైతులకు వివరించారు. అనంతరం ఆర్డీఓ భూమిని పరిశీలించారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య



వేంపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది



చింతకొమ్మదిన్నె : దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు


పులివెందుల రూరల్ : దోమల నివారణ కార్యక్రమాలలో పాల్గొనే ఆరోగ్య సిబ్బంది చురుగ్గా పాల్గొనాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్థానిక మహాత్మా జ్యోతిభా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు దోమల కాటువల్ల కలిగే ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్త సావిత్రి, స్టాఫ్ నర్సు సుష్మా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేంపల్లెలో..


వేంపల్లె : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని తాళ్లపల్లెలో దోమలపై ప్రతిజ్ఞ నినాదాలతో ర్యాలీ చేశారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గన్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వస్తాయన్నారు. ఆ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నిహారిక, శాంతి, సీహెచ్‌ఓ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషాబేగం, ఎంపీహెచ్‌ఈఓ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ అంకయ్య, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మాదిన్నె : వరల్డ్ మస్కిటో డే సందర్భంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో దోమల నియంత్రణపై ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య శిక్షణలో వున్న ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటక రూపంలో విద్యార్థులు చైతన్యం కలిగించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒక విద్యార్థి దోమ ఆకారంలో దుస్తులు ధరించి ప్రదర్శించడం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైద్యులు సునీత, కవిత, సూపర్‌వైజర్ జనార్ధన్, ఎల్.టి.ప్రసాద్‌లు విద్యార్థుల ప్రదర్శనను అభినందించారు.







ఉత్తమ సేవకు ప్రశంస : ఎస్పీ అశోక్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, జమ్మలమడుగు డీఎస్పీ శ్రీనివాసరావు, పెండ్లిమర్రి డీఎస్పీ జి. మధుసూదన్ రెడ్డి

విద్యుత్ కార్మికులు ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవాలి

పులివెందుల టౌన్ : విద్యుత్ కార్మికులు ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మైసూరారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఉన్న విద్యుత్ కళా వేదిక వద్ద విద్యుత్ కార్మికులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీని చేసుకోవడంవల్ల మీ కుటుంబానికి కూడా భద్రత ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే హౌసింగ్, చిన్నపిల్లల పాలసీల గురించి, వివిధ పథకాల రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏడీఈ గురుమోహన్‌రెడ్డి, ఏఈలు, ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు అనుమతులు తప్పని సరి

మైలవరం(పెద్దముడియం) : పెద్దముడియం మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ సుబ్బారావు బుధవారం తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటానికి ఇటువంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఐదు మందికి మాత్రమే విగ్రహం వెంట అనుమతులు ఉంటాయని తెలిపారు.


విద్యార్థులకు ఆధార్ కార్డు స్పెషల్ క్యాంప్

చింతకొమ్మదిన్నె : మండలంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు ఆధార్ కార్డు స్పెషల్ క్యాంపు బుధవారం నుంచి నిర్వహిస్తున్నారని మండల విద్యాధికారి రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈఓ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని చింతకొమ్మదిన్నె మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం కోవాలన్నారు. ఈ క్యాంపు ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు ఉంటుందన్నారు.

అధిక లోడుతో వెళితే చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : ఆర్టీపీపీ పరిధిలో ట్రక్కులు, ట్యాంకర్లు అధిక లోడుతో వెళుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ సుబ్బిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కలమల్ల పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆర్టీపీపీ నుంచి ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు ప్రాంతాలకు స్థానిక ప్రజలతోపాటు ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వెళుతుంటారన్నారు. టిప్పర్లు, ట్యాంకర్ మితిమీరిన వేగంతోపాటు అత్యధిక లోడుతో వెళుతుండటంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు అత్యధిక లోడు తీసుకపోయే వాహనాలపై చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరు ప్రశాంతంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న మానవతా సంస్థ ప్రతినిధులు

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరు ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. బుధవారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శాంతిని కోరుకున్నప్పుడు భవిష్యత్తు తరాల వారు కూడా ప్రశాంతంగా ఉంటారన్నారు.

రేపు జాబ్‌మేళా

బద్వేలు అర్బన్ : స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంటట్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల పరిపాలన అధికారి ఆర్.వి. సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో, డాక్టర్ రెడ్డీస్ గ్రో ఇవి, హెట్రో డ్రగ్ లిమిటెడ్, గ్రీన్ టెక్ వంటి 16 కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. 18-40 సంవత్సరాల లోపు వయస్సు కలిగి పదవ తరగతి నుండి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు.

గణనాథుని పూజకు వేళాయె..

విక్రయాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

పులివెందుల టౌన్ : వినాయక చవితి అంటే చాలు చిన్నారులకు, యువతకు, పెద్దలకు ఎనలేని ఉత్సాహం. వివిధ రకాల్లో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. 9 రోజుల పాటు గణనాథునికి రోజుకో పూజతో ప్రత్యేక పూజలు చేసి అందంగా అలంకరిస్తారు. ప్రతీరోజు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడుపుతారు. భవిష్యత్తులో చేపట్టే ప్రతి పనిలో విఘ్నాలు కలగకుండా ఉండేందుకు భక్తుల నుంచి తొలిపూజ అందుకునే గణనాథుని విగ్రహాలు వినాయక చవితి పండుగకు విక్రయాలను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే పులివెందులలోని బ్రాహ్మణపల్లె రోడ్డులోని శ్రీకర్ ఫంక్షన్ హాలు సమీపంలో వ్యాపారస్తులు ప్రత్యేక టెంట్లు వేసి వినాయక విగ్రహాలను విక్రయించేందుకు వివిధ రకాల ప్రతిమలను సిద్ధంగా ఉంచారు.



విక్రయాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

వ్యాపారాలు అంతంతమాత్రమే



వివిధ రూపాలతో ఆకర్షించే రంగులతో 5 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు వినాయక విగ్రహాలు సుమారు రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. దూరపు కొండలు నునుపు అన్నట్లుగా దూర ప్రాంతాలలో ఉన్న పట్టణాలకు వెళ్లి వినాయక విగ్రహాలను ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

– శేషయ్య, వినాయక విగ్రహాల వ్యాపారస్తుడు, పులివెందుల

ఘనంగా రవిరెడ్డి జన్మదిన వేడుకలు



అనాథ ఛాత్రాలయంలో విద్యార్థులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అనాథ బాలుర ఛాత్రాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి వారికి అల్పాహార ఏర్పాటు చేశారు. హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గండి భాస్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, హాల్ సురేష్, జయసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సురేష్, సుబ్బన్న, విజయేంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రఘునాథరెడ్డి, జిలానీబాషా, ఆంజనేయరెడ్డి, పుల్లారెడ్డి, రామలక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హీరామియా, జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్, చంద్రపాల్, చంటి, మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మండల నాయకులు కేకులు కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకరరెడ్డి, మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రాక

అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ ఎస్.సౌజన్య శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్బం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్తు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాస్క్యులర్ సర్జరి, ట్రామా రీకన్‌స్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్కో రీకన్‌స్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.